క్లుప్తంగా

ఏవోకు ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు

కొయ్యూరు: మండల పరిషత్ కార్యాలయం పరిపాలన అధికారి(ఏవో) బాలమురళీకృష్ణకు ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవో ప్రసాదరావు నెలరోజుల పాటు సామర్లకోటలో పాలనపరమైన శిక్షణకు వెళ్తున్నారు. ఆయన వచ్చే నెల తొమ్మిది వరకు శిక్షణ పొందుతారు. దీంతో ఎంపీడీవోగా అదనపు బాధ్యతలను ఏవోకు అప్పటించారు.

వీవోఏల సమస్యలపై పోరాటం

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో సోమవారం వీవివోఏల మండల సంఘం ఎన్నిక సీఐటీయూ మండల కార్యదర్శి శంకర్‌రావు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా జరిగింది. సంఘం అధ్యక్షురాలుగా టి.దుర్గాదేవి, కార్యదర్శిగా పి.పద్మనాభం, కోశాధికారిగా ఎం.మనుమాధవ్, సభ్యులుగా జగన్, కమల, సావిత్రి, జ్యోతి, రాజారావు, గణపతి, సుబ్బారావు, గౌతమి, ప్రశాంత్‌లు ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు దుర్గాదేవి, పద్మనాభంలు మాట్లాడుతూ వీవోఏల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని, సంఘం బలోపేతానికి కృషి చేస్తామని, అందరూ సహకారం అందించాలని వారు కోరారు. వీవోఏల సమస్యలపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకర్‌రావు అన్నారు. వీవోఏలు ఎన్నో ఏళ్ల తరబడి పని ఒత్తిడిలు ఎదుర్కొంటూ విధులు నిర్వహిస్తున్నారని, వీవోఏలకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, బకాయి వేతనాలు అందించాలన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



సన్మాన గ్రహీతలతో టీచర్లు, విద్యార్థులు

గంగవరం: అవార్డులు, సత్కారాలు బాధ్యతలను మరింత పెంచుతాయని మోహనాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.వి.వి. సత్యనారాయణ అన్నారు. మోహనాపురం ఆశ్రమ పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సోమయ్య, డివిజన్ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత హెచ్‌ఎం ఆర్.వి.వి.సత్యనారాయణను ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సోమయ్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందడం చాలా ఆనందంగా ఉందన్నారు. డిప్యూటీ వార్డెన్ కె.వీరపురెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా శర్వాణి బాధ్యతల స్వీకరణ



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న నూతన వైద్యాధికారి శర్వాణి

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీ వైద్యాధికారిగా సోమవారం పి.వి.శర్వాణి బాధ్యతలు చేపట్టారు. ఆమె కరప పీహెచ్‌సీ నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశం నిర్వహించి, మెరుగైన వైద్యసేవలు అందించే విధానంపై సలహాలు సూచనలు ఇచ్చారు.

రైతులకు ఎరువులు పంపిణీ

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు రైతు భరోసా కేంద్రంలో సోమవారం రైతులకు ఎరువును పంపిణీ చేశారు. మండల వ్యవసాయశాఖ అధికారి సుజాత అధ్యక్షతన ఎంపీపీ కడబాల ఆనందరావు, వైస్ ఎంపీపీ వలాల విశ్వమ్మ, సర్పంచ్‌లు బచ్చలి చిన్నమ్ములు, ముత్యాల నరసింహమూర్తులు తదితరులు ఎరువులను అందజేశారు. నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు అందజేత

ముంచంగిపుట్టు: మండలంలోని దారెల పంచాయతీ డీంగూడ రైతులకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో వెంకటేశ్వర్లు ఆదేశాలతో సిల్వర్‌ఓక్,మహాగని మొక్కలను ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు గణపతి, రుక్మాంగధర్‌లు పంపిణీ చేశారు. మొక్కలు సరఫరా చేసే యాజమాని తప్పిదం వల్ల చిన్న సైజ్ మొక్కలు రైతులకు సిబ్బంది అందించామని, గిరిజన సంఘం నేతలు తమ దృష్టికి తీసుకురావడంతో వెంటనే మొక్కలు పంపిణీ చేసే ప్లాంటేషన్ యాజమానితో మాట్లాడి పెద్ద సైజ్ మొక్కలను రప్పించి, డీంగూడ గ్రామ రైతులకు పంపిణీ చేశామన్నారు. రైతులకు నాణ్యమైన మొక్కలు, రైతులకు ఉపయోగ పడే విధంగా పంపిణీ చేస్తున్నామన్నారు. నాసిరకం మొక్కలు పంపిణీ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని ఏపీవో వెంకటేశ్వర్లు తెలిపారు.

- అల్లం సాగుపై గిరిజన రైతుల ఆసక్తి
- 150 ఎకరాల్లో పంట
- మార్కెట్‌లో గిరాకీ
- పెరుగుతున్న పంట విస్తీర్ణం

లాభాల సాగు



గరుడాపల్లిలో అల్లం పంట

హుకుంపేట: మండలంలో అల్లం సాగు చేసేందుకు గిరిజన రైతులు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడతో పంట ఆశాజనకంగా మారింది. ఏజెన్సీలో పండించే అతి ప్రాముఖ్యమైన వ్యవసాయ పంటల్లో అల్లం పంట ఒకటి. ఈ పంటను మండలంలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఎక్కువగా సాగు చేస్తారు. పండిన పంటకు మార్కెట్‌లో అనుకూలమైన ధర ఉండటంతో సాగుపై మక్కువ చూపుతున్నారు. వాతావరణం అనుకూలిండంతో ప్రస్తుతం అల్లం సాగు పనులు జోరందుకున్నాయి. మన్యంలో పండించే అల్లంనకు మైదాన ప్రాంతాల్లో మండి డిమాండ్ ఉంది. గిరిజన రైతులు సేంద్రియ పద్ధతిలో అల్లం పండిస్తున్నారు. దీంతో నాణ్యతతో కూడిన అల్లం దిగుబడి అవుతుందని తద్వారా మంచి ధరలు ఉంటున్నాయని రైతులు చెబుతున్నారు.

పనుల్లో నిమగ్నం

మండలంలోని తీగలవలస, మట్టుజోరు, బారమసి, సూకురు, భీమవరం, శోభకోట,మఠం,తడిగిరి పంచాయితీలలోని పలు గ్రామల్లో సుమారు 150 ఎకరాల్లో గిరిజనులు ఈ పంట సాగు చేశారు. ఈ ఏడాది కాస్త ధరలు ఉండడం వలన అల్లం సాగు చేసేందుకు గిరిజన రైతులు సాగు చేసే పనిలో నిమగ్నం అయ్యారు. కొన్ని ప్రాంతల్లో అల్లం తవ్వి సంతల్లో విక్రయాలు చేస్తున్నప్పటికి మరి కొన్ని ప్రాంతల్లో అల్లం సాగుకు గాబు తీసే పనుల్లో గిరిజన రైతులు నిమగ్నమయ్యారు. వారపు సంతల్లో అల్లం ధర కిలో రూ. 45 నుంచి రూ.50 వరకు ధరలు పలుకుతుండడంతో సాగుపై మరింత ఆసక్తి పెంచుకుంటు మరింత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు.



సంతలో అమ్మకానికి తీసుకొచ్చిన అల్లం

సబ్సిడీపై విత్తనాలు అందజేయాలి



అల్లం పంట సాగుచేసుకునేందుకు విత్తనాలను బయట మార్కెట్‌లో ఎక్కువ ఖర్చు వెచ్చించి కొనుగోలు చేస్తున్నాం. ప్రభుత్వం ప్రోత్సహించి సబ్సిడీపై అల్లం విత్తనాలు పంపిణీ చేస్తే మరింత ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తాం. ప్రభుత్వం అటవీ ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పించి రైతులను ఆదుకోవాలి.

కిముడు రాంబాబు, గరుడాపల్లి గ్రామం, హుకుంపేట మండలం

ధరలు ఇంకా పెంచాలి



అల్లం సాగులో ఎక్కువగా పనిభారం ఉన్నా సరే, ప్రభుత్వం ప్రోత్సహం లేకున్నా సాగు చేస్తున్నాం. మా కష్టాన్ని అధికారులు దృష్టి పెట్టి మార్కెట్‌లో ఇంకా ఎక్కువగా ధరలు పెంచాలి. సంతల్లో దళారుల బెడద లేకుండా చూడాలి. మార్కెట్‌లో ధరలు ఎక్కువగా ఉంటే సాగు చేయడానికి మరింత ఆశక్తి ఉంటుంది.

మర్రి బోంద్రు, రైతు, బోద్రుగుడ గ్రామం, హుకుంపేట మండలం

బెడ్ పద్ధతిలో సాగుతో అధిక దిగుబడులు



అల్లం సాగు చేసే రైతులు బెడ్ పద్ధతి(ఎత్తుమడల విధానం లేదా బోదే సాళ్ల) విధానంలో అల్లం విత్తుకోవాలి. ఈ విధానంలో అల్లం సాగు చేయడం వలన 15% దిగుబడి పెరగవచ్చు. అల్లం విత్తనాలకు బీజామృతం లేదా ట్రికో డెర్మా విరిడి పౌడర్‌ను రెండు గ్రాములు లీటరు నీటికి కలుపుకుని విత్తనశుద్ధి చేసి సాగు చేయాలి. ఈ పద్ధతి ద్వారా సాగు చేస్తే దుంప కుళ్ల తెగులు నివారించవచ్చు.

డి.ప్రియాంక, హెచ్‌వో, హుకుంపేట మండలం

నేడు చింతూరులో బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ

చింతూరు: చింతూరులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రంపచోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటారని ఆయన తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేత్రదానంపై అవగాహన



దుప్పలపాలెంలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

అడ్డతీగల: నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం అడ్డతీగల మండలం దుప్పులపాలెం పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత వైద్యాధికారి స్పందన, ఆఫ్తాల్మిక్ అధికారి యోసుపాదం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. నేత్రదానంతో ఒకరికి కొత్త జీవితం వస్తుందన్నారు. నేత్రదానంపై అపోహలు వీడాలని కోరారు. నేత్ర సమస్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

‘అన్నదాత పోరు’కు తరలిరండి

హుకుంపేట: యూరియా కొరతపై రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వారి పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాడేందుకు పాడేరు కలెక్టరేట్ వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపడుతున్నామని, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు బత్తిరి రవిప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు పాంగి అనిల్ ఆధ్వర్యంలో సోమవారం పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఆయన మాట్లాడుతూ రైతుల పక్షాన చేపట్టే ఈ కార్యక్రమానికి మండలంలోని గిరిజనులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. పార్టీ మండల గౌరవ అధ్యక్షుడు గండేరు చినసత్యం, సర్పంచ్‌లు సమిడ వెంకటపూర్ణిమ, రేగం రమేష్, బేసు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు కె.వెంకట్, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కొర్ర కాసులమ్మ, ఎంపీటీసీ సభ్యుడు కొర్ర నాగరాజు, కో-ఆప్షన సభ్యుడు యాసీన్, నాయకులు విశ్వేశ్వరరావు, రామకృష్ణ, సూరిబాబు, కోటిబాబు పాల్గొన్నారు.

గూడెం కొత్తవీధి (చింతపల్లి): కూటమి ప్రభుత్వం చేపడుతున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా మంగళవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపడుతున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గూడెం కొత్తవీధి ఎంపీపీ బోయిన కుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్‌లు అన్నారు. గూడెం కొత్తవీధి మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు కార్యక్రమం పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు కష్టాలు మొదలయ్యాయన్నారు. సకాలంలో విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయకపోవడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే ప్రభుత్వం పంపిణీ చేసిన రాజ్‌మా విత్తనాల్లో ఎక్కువ శాతం మొలకెత్తిన విత్తనాలను పంపిణీ చేశారన్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులను ఆదుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరశనగా పాడేరులో చేపట్టే అన్నదాత పోరును విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. వైస్ ఎంపిపి లోతా దేముడు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు అరుణ్‌కుమార్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కంకిపాటి నారాయణ, కో-ఆప్షన్ సభ్యుడు దావూద్, మాజీ జెడ్పీటీసి మత్యరాజు, వైస్ సర్పంచ్ కొర్రా రాంబాబు, నాయకులు కొర్రా నూకరాజు, రామలింగం, రామ్మూర్తి, రామారావు, మజీద్, పవన్, సీమన్న, మార్క్, శాంతి రాజు తదితరలు పాల్గొన్నారు.



జీకే వీధిలో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ బోయిన కుమారి, నేతలు

శ్రమదానంతో రహదారి గోతులు పూడ్చివేత



భూసిపుట్టు మార్గంలో రాళ్లతో గోతులను పూడుస్తున్న గ్రామస్తులు



శ్రమదానంతో గోతులు పూడ్చిన భూసిపుట్టు గ్రామ యువకులు

ముంచంగిపుట్టు: మండలంలో గల భూసిపుట్టు పంచాయితీ కేంద్రానికి వెళ్లే మార్గంలో బూరుగుమెట్ట గ్రామం నుంచి పూలబంధ వరకు ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి పాడై గోతుల మయంగా మారింది.నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర పడుతున్నారు.రహదారికి మరమ్మతులు చేయాలని అధికారులకు తెలిపిన స్పందన లేదు.సోమవారం భూసిపుట్టు పంచాయితీ మాజీ సర్పంచ్ వంతాల మంగ్గన్న ఆధ్వర్యంలో యువత శ్రామదానంతో ముందుకు కదిలారు.సుమారుగా మూడు కిలో మీటర్ల రహదారి పోడువునా ఉన్న గోతులను మట్టి,రాళ్లతో పూడ్చారు.రహదారిపై కొట్టుకువచ్చిన బండరాళ్లు,మట్టిని తొలగించారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మంగ్గన్న మాట్లాడుతూ భూసిపుట్టుకు వచ్చే మార్గంలో గోతులతో వాహనదారులు రాకపోకలకు కష్టాలు పడుతున్నారని,తక్షణమే అధికారులు స్పందించాలని కోరారు. గణపతి,ధనుంజయ్,విన్నారావు,కృష్ణారావు,జగన్నాయ్,బాలక్రిష్ణ,వాసు,సాధురాం, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం అరాచక పాలన

జి.మాడుగుల: ఎన్నికల్లో మోసపూరిత హామీలు గుప్పించి కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి, రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సుర్మాని మత్స్యకొండంనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వంజరి సీతారాంనాయుడు దుయ్యబట్టారు. మండలంలో కోరాపల్లి పంచాయతీ అరగడాపల్లి గ్రామంలో పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్వర్యంలో సోమవారం బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ సరిగ్గా నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసి ఎంతో ప్రతిష్టాత్మకమైన గ్రామ సచివాలయలో సేవలను అందుబాటులోనికి తీసుకొచ్చారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులపై తీవ్రమైన పనిభారం మోపి ఒత్తిడిని పెంచి కక్ష సాధింపులకు గురిచేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆరాచక పాలన రాష్ట్ర ప్రజలందరు గమనిస్తున్నారని, త్వరలో బుద్ధి చెబుతారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు సీట్లు అన్నీ కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాల వివరాలతో కూడిన క్యూఆర్ కోడ్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జిలా ప్రధాన కార్యదర్శి సీతారాంనాయుడు,జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పండన్న, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బంగారాజు, కార్యదర్శి బాలయ్యపడాల్, మాజీ ఉప సర్పంచ్ చంద్రమోహన్, నాయకులు వరహాలనాయుడు, వాలింటీర్లు సాయి, కొండబాబు తదితరలు పాల్గొన్నారు.



అరగడాపల్లిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మత్స్యకొండం నాయుడు, నాయకులు

విద్యతోనే సమగ్ర వికాసం

ముంచంగిపుట్టు: కలెక్టర్ దినేస్‌కుమార్ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ అరిసెల సీతమ్మ మాట్లాడుతూ విద్యతోనే సమగ్ర వికాసం కలుగుతుందన్నారు.మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది విద్య ఒక్కటేనన్నారు. మనిషిని విజ్ఞాన ఖనిగా మార్చగల ఆయుధం కేవలం అక్షరం మాత్రమేనన్నారు. గిరిజన గ్రామాల్లో అధికంగా నిరక్షరాసులున్నారని, అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి వయోజన విద్యను ప్రొత్సహించాలని, చదవడం, రాయడం నేర్పాలని ఆమె కోరారు. జిల్లా నోడల్ అధికారి కె.గంగన్నదొర, ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, ఎంఈవో కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ కొండన్నదొర, వనభసింగి మాజీ సర్పంచ్ జయదేవ్, అధ్యాపకులు విశ్వేశ్వరరావు, కొటిబాబు, దామోదరం తదితరులు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న ఎంపీపీ సీతమ్మ, అధికారులు

చింతపల్లి: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. విద్యకు యొక్క ఆవశ్యకతను వివరించారు.అధ్యాపకులు కెజియా రాణి, శ్రీనివాసరావు, రవీంద్రనాయక్, జగదీష్, గిరిజ, విద్యార్థులు పాల్గొన్నారు.

రంపచోడవరం: మండలంలోని బోర్నగూడెంలోని ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం గడిపే విశ్వరాజ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ అక్షరాసత్య దినోత్సవంలో సర్పంచ్ కోసు రమేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు కుంజం వంశీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు పొందిన విశ్వరాజ్‌ను సన్మానించారు. బోర్నగూడెం, చినబారంగి గ్రామాల్లో పాడైన వీధి లైట్లకు మరమ్మతులు చేయించారు. అధ్యాపకురాలు వెంకటలక్ష్మి, వార్డు సభ్యుడు సత్యనారాయణ, బాపనమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొబ్బా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లి డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయభారతి



రంపచోడవరంలో ర్యాలీలో ప్రజాప్రతినిధులు, తదితరులు

కూటమి నాయకులు చౌకబారు విమర్శలు మానుకోవాలి

గూడెం కొత్తవీధి (చింతపల్లి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రతిపక్ష నాయకులను విమర్శించడమే పనిగా పెట్టుకోవడం జనసేన నాయకులకు తగదని గూడెం కొత్తవీధి వైఎస్సార్‌సీపీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు కంకిపాటి నారాయణ అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలుచేయలేక ప్రతిపక్ష పార్టీపై విమర్శలు చేయడం పరిపాటిగా మారిందని విమర్శించారు. ప్రశ్నించడం కోసమే స్థాపించిన పార్టీగా ప్రగల్భాలు చేసిన జనసేన అదినాయకుడు ఇప్పుడు ఎక్కుడున్నారని, రాష్ట్రంలో అరాచకం పాలన సాగుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీపై లేనిపోని చౌకబారు విమర్శలు చేస్తే జగనన్నసేన చూస్తూ ఊరుకోదని, ఉపాధి కూలీలకు నెలలు తరబడి వేతనాలు చెల్లించలేని దారుణ పరిస్థితిలే కూటమి ప్రభుత్వం ఉందన్నారు. నాయకులు లక్ష్మణ్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు నారాయణ తదితరులు

కంటి శస్త్ర చికిత్సలకు 50 మంది తరలింపు

చింతపల్లి: మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ డీపీఎం డాక్టర్ విశేశ్వరనాయుడు మాట్లాడుతూ శిబిరంలో 50 మందికి శస్త్ర చికిత్సలు అవసరమున్నట్టు గుర్తించామని, వారిని విశాఖ ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి తరలించామన్నారు. నేత్ర దానంపై అవగాహన కల్పించారు. సిబ్బందితో కలిసి నేత్రదానంపై ప్రమాణం చేశారు. డాక్టర్ లావణ్య, ఫిజియోథెరపిస్టు సరోజిని, అప్తాలమిక్ అసిస్టెంట్ రమణ పాల్గొన్నారు.



ప్రమాణం చేస్తున్న వైద్యులు సిబ్బంది

ఆది కర్మయోగి అభియాన్‌పై సర్వే

జి.మాడుగుల: మండలంలోని సాడేక్ గ్రామంలో సోమవారం ఆది కర్మయోగి అభియాన్ సర్వే జరిగింది. ఈ సందర్భంగా డీఎంటీ ఇన్‌చార్జి ఎంపీడీవో డేవిడ్‌రాజ్, సర్పంచ్ కిముడు రాంబాబు గ్రామంలో పర్యటించి, స్థానిక సమస్యలను గ్రామస్తుల నుంచి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రహదారులు, తాగునీటి సమస్యను పరిశీలించారు. సర్వే నివేదికను తయారుచేసి అందించాలని డీఎంటీ ఇన్‌ఛార్జీ డేవిడ్ రాజ్ ఆదేశించారు.

రహదారి సమస్యపై వినతి

రాజవొమ్మంగి: కాకినాడ జిల్లా ఏలేశ్వరం నుంచి రాజవొమ్మంగి, అడ్డతీగల, వై.రామవరం తదితర మండలాల్లో గిరిజన గ్రామాలకు వెళ్లేందుకు సరైన రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని సమస్య పరిష్కరించాలని కోరుతూ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు తదితరులు కాకినాడ కలెక్టర్ షన్మోహన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు.గోతుల రహదారితో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వినతిలో పేర్కొన్నారు. దీనిపై కాకినాడ కలెక్టర్ సానుకూలంగా స్పందించి రహదారి నిర్మాణానికి హామీ ఇచ్చారని రామారావు తెలిపారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

గంగవరం : మండలంలోని గంగవరం, పిడతమామిడి పీహెచ్‌సీల పరిధిలోని మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు గంబుషియా చేప పిల్లలను వేసినట్టు గంగవరం, పిడతమామిడి వైద్యాధికారులు భావన, నిహిత చెప్పారు. గ్రామాల్లో దోమల నివారణకు తగిన చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సూరిబాబు, డిప్యూటీ ఎంపీడీవో నర్సింగరావు, కార్యదర్శి శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

కూనవరం: మండలంలోని శబరి, గోదావరి వరద బాధిత ప్రాంతాలైన ఉదయభాస్కర్ కాలనీ, గిన్నెల బజార్, శివాలయం వీధి తదితర ప్రాంతాల్లో దానధర్మట్రస్ట్ సమకూర్చిన నిత్యావసర సరకులను ఎంపీపీ పాయం రంగమ్మ, ఎస్‌ఐ లతాశ్రీ సోమవారం పంపిణీ చేశారు. దానధర్మ ట్రస్ట్ సేవలను పలువురు కొనియాడారు. గీద శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రామారావు, నేతలు వెంకన్న, చంటి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాఫీ బెర్రీ బోరర్‌పై అవగాహన

జి.మాడుగుల: మండలంలో సుర్మతి పంచాయతీ వాకపల్లి గ్రామంలో కాఫీ బెర్రీ బోరర్ తెగులు నుంచి నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సర్పంచ్ తల్లే సూరిబాబు, లైజన్ వర్కర్ గుండుదొర తెలిపారు. వాకపల్లి గ్రామంలో కాఫీ బెర్రీ బోరర్ సోమవారం కాఫీ రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ కాఫీ తోటల్లో బెర్రీ బొరర్ తెగులు ఆశించకుండా కాఫీ సిబ్బంది, అధికారుల సూచనలు,సలహాలను పాటించాలన్నారు. పంటకు బెర్రీ బోరర్ లక్షణలు కన్పిస్తే తక్షమే కాఫీ అధికార్లు, సిబ్బందికి తెలియజేయాలని కోరారు. నాయకులు పోతురాజు, చిరంజీవి వంశీకృష్ణ,సెల్స్‌మన్ సింహచలం పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల కమిటీ నూతన కార్యవర్గం



కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు

జి.మాడుగుల: మండలంలో గాంధీనగరంలో పాఠశాలలో సోమవారం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రావుల జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో మండల కమిటీ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా ఎస్.సింహచలంనాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ధనుంజయ్, ఉపాధ్యక్షులుగా ఎం.రవి, ఎం.శ్రీనివాస్, కె.నాగమణి, కార్యదర్శులుగా ధర్మారావు, సత్యనారాయణ నాయుడు, విజయకుమార్, కళ్యాణ్, జిల్లా కౌన్సిలర్‌గా రంజన్‌కుమార్, రామచంద్రుడు, నీలకంఠం నాయుడు, అనసూయ, నాగమణి ఎన్నికైయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి శెట్టి శాంతకుమారి, పరిశీలకుడుగా జగన్‌మోహన్‌రావు వ్యవరిచారు.

మద్దిగరువును మండల కేంద్రంగా ప్రకటించాలి

జి.మాడుగుల: మద్దిగరువుని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మండల సాధన కమిటీ అధ్వర్యంలో మద్దిగరువు గ్రామంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. మండల సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి పోత్రంగి రత్నం, గిన్నెలకోట ఎంపీటీసీ గడుతూరి కొండబాబు మాట్లాడుతూ ఈ ప్రాంతం అన్ని రంగాల్లో చాలా వెనుకబడి ఉందని, మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. నాయకులు కామేశ్వరరావు, దయానిధి, సూర్యనారాయణ, జీవన్, భగవాన్‌రావు, గణపతి తదితరలు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఘనంగా వినాయక నిమజ్జనం



గణనాథుని ఊరేగింపులో సందడి

ఎటపాక: స్తానిక గన్నేరుకొయ్యపాడులోని ఎస్సీ కాలనీలో వినాయక విగ్రహ నిమజ్జనం సోమవారం ఘనంగా జరిగింది. భక్తుడు వసంతాల శివ టీషర్టులను పంపిణీ చేశారు. యువత,చిన్నారులు డ్యాన్స్‌లు చేశారు. సమీపంలోని పవిత్ర గోదావరిలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కమిటీ సభ్యులు శ్యామ్, నరేష్, రమేష్ తదితరులు పర్యవేక్షించారు.

సీలేరు: మన్యం శబరిమలై అయ్యప్ప స్వామి ఆలయంలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా వినాయక ఉత్సవ మూర్తిని సోమవారం సీలేరులో ఊరేగించారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



కార్డుల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి తదితరులు

రంపచోడవరం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ సమీపంలో సోమవారం రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు డివిజన్‌ల పరిధిలో లబ్ధిదారులకు సచివాలయ సిబ్బందితో ఈ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. ఎంపీపీ బంధం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, రాష్ట్ర ఎస్టీ కమిటీ సభ్యురాలు సునీత, వైస్ ఎంపీపీ బాలకృష్ణ, సర్పంచ్ బొజ్జయ్య, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, తహసీల్దార్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.